క్లుప్తంగా...

మౌలిక వసతుల కల్పనకు కృషి



నాలా పనులను పరిశీలిస్తున్న మేయర్ బుచ్చిరెడ్డి

బోడుప్పల్: మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు బోడుప్పల్ మేయర్ సామల బుచ్చిరెడ్డి అన్నారు. బోడుప్పల్ నుంచి నల్ల చెరువుకు వెళ్లే నాలా పనులను ఆయన సోమవారం జేసీబీతో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలాకు చుట్టుపక్కల ఉన్న కాలనీవాసులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా మిగిలిపోయిన పనులను త్వరతిగతిన పూర్తి చేస్తామన్నారు. నాలా నీరు, వర్షపు నీరు నాలాలో నిల్వకుండా ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో డీఈఈ శారద, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కాటపల్లి రాంచంద్రారెడ్డి, సత్యం రెడ్డి తదితరులున్నారు.

మజ్జిగ పంపిణీ

రామంతాపూర్: ప్రధాన రహదారి హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ వద్ద సోమవారం జూలూరి రమేష్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు సాయి, రఘు, లత తదితరులు పాల్గొన్నారు.

జలమండలి అధికారుల తీరుపై నిరసన



కార్యాలయం బయట నిరసన వ్యక్తం చేస్తున్న కార్పొరేటర్ శ్రవణ్

మల్కాజిగిరి: జలమండలి అధికారుల తీరుపై మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ నిరసన వ్యక్తం చేశారు. కార్పొరేటర్ మాట్లాడుతూ సోమవారం ఉదయం 11.30 గంటల సమయంలో సమస్యలపై అధికారులను కలిసేందుకు వెళ్లినప్పుడు కార్యాలయం తెరచిన ప్పటికీ అధికారులు, సిబ్బంది ఎవరూ అందుబాటులో లేరన్నారు. అధికారులు, సిబ్బందికి సమస్యలపై ఫోన్ చేసినా స్పందించరని, కౌన్సిల్‌లో కూడా ఈ సమస్యను తీసుకొచ్చానన్నారు. తీరు మారకపోతే కాలనీ ప్రజలతో కలిసి ముట్టడిస్తామన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ జితేంద్రనాథ్

అల్వాల్: మచ్చబొల్లారం డివిజన్ పరిధిలోని హెచ్ఎంటీ నగర్ కాలనీలో సుమారు రూ.68 లక్షలతో చేపట్టే ఏడు సీసీ రోడ్ల నిర్మాణ పనులను స్థానిక కార్పొరేటర్ జితేంద్రనాథ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే సహకారంతో పనులను త్వరితగతిన పూర్తి చేస్తున్నామని, బతుకమ్మ పార్కు వద్ద వాకింగ్ ట్రాక్ ఏర్పాటుకు కూడా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో డీఈ మహేష్, ఎస్ఎస్ ప్రభాకర్, ఏఈ రవళి తదితరులు పాల్గొన్నారు.

క్రేన్ మిషన్ తగిలి హెల్పర్ మృతి

మల్లాపూర్: క్రేన్ మిషన్ తగిలి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన నాచారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. శత్రుధన్(19) బతుకుదెరువు కోసం యూపీ నుంచి వచ్చి బోడుప్పల్ హేమానగర్‌లో నివాసం ఉంటున్నాడు. నాచారం పారిశ్రామిక వాడ సీపీకో మెటల్ ఇండ్రస్టీలో క్రేన్ హెల్పర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం రాత్రి క్రేన్ డ్రైవర్ వీరేందర్ సింగ్ జాదవ్ నిర్లక్ష్యంగా డ్రైవింగ్‌తో చేయడంతో శత్రుధన్ తలకు క్రేన్ తగిలించాడు. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సోమవారం శత్రుధన్ బావ రంజిత్ ఫిర్యాదు మేరకు డ్రైవర్ వీరేందర్‌సింగ్ జాదవ్, కంపెనీ మేనేజర్ మనీష్ కుమార్‌పై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమాలకు పాల్పడుతున్న వారిపై ఫిర్యాదు

ఘట్‌కేసర్: ఘనాపూర్‌లో అక్రమాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని బొక్కొనిగూడకు చెందిన కృష్ణారెడ్డి కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఫిర్యాదు చేశాడు. గ్రామంలోని సర్వే నంబర్లు 1134–1149 వరకు ఉన్న వెంచర్లలోని ప్లాట్లను పార్కు స్థలాలుగా చూపిస్తూ అమాయకులను మోసం చేస్తున్నారని లేఖలో పేర్కొన్నారు. అక్రమార్కులపై విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

పీఎంశ్రీ నిధులు.. వసతులు మెరుగు

- పీఎంశ్రీ పథకానికి బోడుప్పల్ జెడ్పీహెచ్ఎస్ ఎంపిక
- ఈ పథకం ద్వారా స్కూల్‌కు రూ.2 కోట్లు మంజూరు
- విద్యార్థుల ప్రతిభకు మరింత పదును పెట్టేలా..
- మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా నిధులు
- మరింత బాధ్యత పెరిగిందన్న ప్రధానోపాధ్యాయుడు



బోడుప్పల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవనం

బోడుప్పల్: ప్రధాన మంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా(పీఎంశ్రీ) పథకం కింద బోడుప్పల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎంపికైంది. దీంతో 5 ఏళ్లలో రూ.2 కోట్ల మౌలిక వసతుల కల్పనకు నిధులు రానున్నాయి. గ్రామస్థాయి విద్యార్థులకు కూడా జాతీయ స్థాయి విద్యా ప్రమాణాలను అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని తీసుకొచ్చింది. విద్యార్థుల ప్రతిభకు మరింత పదును పెట్టి, ఉపాధి మార్గాలకు పాఠశాల దశలోనే పునాదులు వేసే దిశగా అడుగులు వేస్తున్నట్లు తెలిస్తోంది. బోడుప్పల్ పాఠశాల పీఎంశ్రీకి ఎంపిక కావడంపై ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.శ్రీనివాస్‌రెడ్డి హర్షం ప్రకటించడంతోపాటు మరింత బాధ్యత పెరిగిందని వెల్లడించారు.

ఎంపిక జరిగింది ఇలా..

పాఠశాలలో జరుగుతున్న విద్యా బోధన, ఆట స్థలం, కాంపౌండ్ వాల్, విద్యార్థుల తరగతి గదులు, మల మూత్ర శాలలు, ఫైర్ సేఫ్టీ, డిజిటల్ క్లాస్ రూంలు, గ్రంథాలయం, ఉపాధ్యాయుల సంఖ్య, బోధన విధానాలు, కొన్నేళ్లుగా 10వ తరగతిలో వస్తున్న గ్రేడ్‌లు, ఉన్నతాధికారుల పర్యవేక్షణ, సహకారం, అందుతున్న నిధులతోపాటు ఆ స్కూల్‌కు కావాల్సిన అదనపు గదులు, మరమ్మతులు, మౌలిక సదుపాయాల సమాచారాన్ని సేకరించి ఎంపిక చేశారు. ఈ పథకం కింద మంజూరైన రూ.2 కోట్లలో సంవత్సరానికి రూ.40 లక్షలు చొప్పున నిధులు విడుదల చేసి 5 ఏళ్లలోపు పనులు పూర్తి చేస్తారు.

పెరిగిన విద్యార్థులు, ఉత్తీర్ణత శాతం

గడిచిన నాలుగేళ్లలో బోడుప్పల్‌లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది. దీంతో పాటు విద్యార్థుల ఉత్తీర్ణత శాతం మెరుగుపడింది. తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో కలిపి 1999–20 సంవత్సరంలో 620 మంది విద్యార్థులున్నారు. 2020–21 సంవత్సరంలో 660 మంది, 2021–22 సంవత్సరంలో 693 మంది, 2022–23 సంవత్సరంలో 734 మంది విద్యార్థులున్నారు. 1999–20 సంవత్సరంలో పదవ తరగతిలో 97 మంది విద్యార్థులు ఉండగా 100శాతం పాసయ్యారు. 2020–21 సంవత్సరంలో 124 మంది విద్యార్థులుండగా 100శాతం పాసయ్యారు. (కరోనా సమయం), 2021–22 సంవత్సరంలో 133 మంది విద్యార్థులు ఉండగా 94 శాతం, 2022–23 సంవత్సరంలో 97 మంది విద్యార్థులుండగా 86 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు రికార్డుల ద్వారా తెలుస్తోంది.

ఉత్తమ విద్యా బోధన.. ఆహ్లాదకరమైన వాతావరణం..

బోడుప్పల్ జెడ్పీహెచ్ఎస్‌లో మొత్తం 20 తరగతి గదులున్నాయి. వాటిలో 6 తరగతి గదుల్లో డిజిటల్ రూమ్స్‌గా ఏర్పాటు చేసి బోధన చేస్తున్నారు. ఒక రూంలో సైన్స్ ల్యాబ్, మరో రూంలో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. మిగతా 12 తరగతి గదుల్లో రెగ్యులర్ తరగతులు నిర్వహిస్తున్నారు. మొత్తం 20 మంది ఉపాధ్యాయులున్నారు. ఒకేషనల్ ఎడ్యుకేషన్ కింద మరో ఇద్దరు టీచర్లు పని చేస్తున్నారు. పచ్చని చెట్లు, ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యార్థులకు బోధన చేస్తున్నారు. విశాలమైన ప్లే గ్రౌండ్ ఉండగా పాఠశాలలో మూడు వైపులా పచ్చని చెట్లను పెంచారు.

మరింత బాధ్యత పెరిగింది



పీఎంశ్రీ పథకం కింద బోడుప్పల్ జెడ్పీహెచ్ఎస్ ఎంపిక కావడం మరింత బాధ్యత పెంచింది. గడిచిన నాలుగేళ్లలో విద్యార్థుల సంఖ్య పెంచడంతోపాటు ఉత్తీర్ణత శాతం పెంచాం. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా విద్యా బోధన చేస్తున్నాం. సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి డిజిటల్ క్లాస్‌లు నిర్వహిస్తున్నాం. అంతేగాకుండా పాఠశాల ఆవరణంలో అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం. ప్రభుత్వం ద్వారా దాతల సహాయంతో నూతన తరగతి గదులను నిర్మించాం. మల మూత్ర శాలలు ఏర్పాటు చేశాం. పీఎంశ్రీ పథకం ద్వారా వచ్చే నిధులతో మరిన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తాం.

– ఎం.శ్రీనివాస్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు బోడుప్పల్

బాక్స్‌డ్రైన్ పనుల పరిశీలన



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సబితా కిషోర్

అల్వాల్: వెంకటాపురం డివిజన్ జోషినగర్‌లో రూ.1.2 కోట్లతో జరుగుతున్న బాక్స్ డ్రైన్ నిర్మాణ పనులను స్థానిక కార్పొరేటర్ సబితా కిషోర్ పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ బాక్స్ డ్రైన్ నిర్మాణం పూర్తయితే ముంపు సమస్య పరిష్కారం అవుతుందన్నారు. నిర్మాణ సమయంలో ప్రజలు కూడా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో అనిల్ కిషోర్, ఏఈ అరుణ్, వెంకట్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ మంజూరు



ఎల్‌ఓసీ పత్రాలను అందజేసిన సతీష్‌కుమార్

మల్కాజిగిరి: సీతారాంనగర్‌కు చెందిన రమకు వైద్య ఖర్చుల నిమిత్తం మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ద్వారా ఎల్‌ఓసీ మంజూరైంది. సోమవారం ఎల్‌ఓసీ పత్రాలను ఆమె కుటుంబసభ్యులకు టీఆర్ఎస్ అధికార ప్రతినిధి జీఎన్వీ సతీష్ కుమార్, స్వామి, గణేష్, జగదీష్ అందజేశారు.

వేడుకగా అభయాంజనేయ స్వామి శోభాయాత్ర



మల్లికార్జుననగర్ గుట్ట అభయాంజనేయ స్వామి శోభాయాత్రలో ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి

ఉప్పల్: చిలుకానగర్ మల్లికార్జున్‌నగర్ గుట్టపై వెలిసిన శ్రీఅభయాంజనేయ స్వామి ప్రథమ వార్షికోత్సవం అంగరంగా వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఆదివారం సాయంత్రం నిర్వహించిన స్వామి వారి శోభాయాత్రకు ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శోభాయాత్రలో పాల్గొన్నారు. ఆలయ ఫౌండర్ ట్రస్టీ చైర్మన్ గుడి మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఈవో భాగ్యలక్ష్మీ, శ్రీకాంత్, స్థానికులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. బీఆర్ఎస్ నాయకులు జనుంపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి, గడ్డం రవికుమార్, నాయబు వెంకటరావు పల్లె నర్సింగ్‌రావు, పిట్టల నరేష్, ఈరెల్లి రవీందర్‌రెడ్డి, రాజు, తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

నిజాయితీ చాటుకున్న ఆటో డ్రైవర్



డీసీపీ జానకి, ఏసీపీ నరేష్‌రెడ్డికి బ్యాగ్‌ను అందజేస్తున్న ఆటో డ్రైవర్ బాలపీరు

ఉప్పల్: ప్రయాణికురాలు తన ఆటోలో మరిచిపోయిన బ్యాగ్, విలువైన నగలను నిజాయితీగా ఉప్పల్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించి శభాష్ అనిపించుకున్నాడు ఓ ఆటో డ్రైవర్. వృద్ధురాలు మరిచిపోయిన బ్యాగ్, అందులో ఉన్న మూడు తులాల బంగారు గొలుసును లక్ష్మీనారాయణ కాలనీకి చెందిన ఆటో డ్రైవర్ చందుమల బాలపీరు సోమవారం మల్కాజిగిరి డీసీపీ జానకి, ఏసీపీ నరేష్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్లు గోవింద్‌రెడ్డి, వెంకటేశ్వర్ల సమక్షంలో అందజేసి ప్రసంశలు అందుకున్నాడు. వరంగల్ ప్రాంతానికి చెందిన అనాషతమ్మ(65) ఆదివారం రామంతాపూర్ చర్చి కాలనీలో శుభకార్యానికి ఉప్పల్‌లో ఆర్టీసీ బస్సు దిగింది. చర్చికాలనీకి ఆటోలో వెళ్లింది. లగేజీ బ్యాగ్‌ను మరిచిపోయి దిగింది. తర్వాత గుర్తించిన ఆటో డ్రైవర్ బ్యాగును సోమవారం ఉప్పల్ పోలీసులకు అప్పగించాడు. దీంతో ఆటో డ్రైవర్‌ను పోలీసు ఉన్నతాధికారులు అభినందించారు.

బస్సు ఢీకొందని ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి



మాట్లాడుతున్న డీసీపీ జానకి, పోలీస్ అధికారులు

- రూ.13,690ల నగదు దోపిడీ
- ఏడుగురు యువకుల అరెస్ట్
- నగదు, ఒక కారు స్వాధీనం

మేడిపల్లి: బస్సు కారును ఢీకొందన్న కోపంతో కారులో ఉన్న ఏడుగురు యువకులు బస్సును అడ్డగించి ఆర్టీసీ బస్ డ్రైవర్‌పై దాడిచేసి, నగదు దోపిడీ చేసిన ఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సోమవారం విలేకరుల సమావేశంలో మల్కాజిగిరి డీసీపీ జానకి మాట్లాడుతూ.. ఆదివారం రాత్రి వరంగల్ నుంచి హైదరాబాద్‌కు వస్తున్న ఆర్టీసీ బస్సును నారపల్లి వద్ద ఆపారు. మారుతి ఎర్టిగా కారును బస్సు ఢీకొందని డ్రైవర్‌పై కార్వాన్, మెహిదీపట్నం ప్రాంతానికి చెందిన ఏడుగురు యువకులు కొడిదల సరేష్(19), పల్లా పవన్(23), పల్లపు రాజు(22), పల్లపు ప్రమోద్(22), సానిపాయ రవి(24), పల్లపు నవీన్(23), పల్లపు నవీన్(26) దాడి చేసి రూ.13,690 నగదును దోచుకెళ్లారు. బస్సులోని ప్రయాణికులు డ్రైవర్‌ను రక్షించే ప్రయత్నం చేయగా వారిని సైతం దుర్భాషలాడుతూ బస్సు టైర్ గాలితీసి కారులో పారిపోయారు. ఓ వ్యక్తి డయల్ 100కు సమాచారం అందించాడు. వెంటనే పోలీసులు సికింద్రాబాద్ సమీపంలో కవాడిగూడ వద్ద వారిని అదుపులోకి తీసుకున్నారు. నగదు, ఎర్టిగా కారును స్వాధీనం చేసుకున్నామని పోలీసులు తెలిపారు. మేడిపల్లి పోలీసులను డీసీపీ జానకి అభినందించారు. కార్యక్రమంలో ఏసీపి నరేష్‌రెడ్డి, సీఐ గోవర్ధనగిరి, డీఐ ప్రవీన్ బాబు, డీఎస్ఐ లక్ష్మణ్, ఎస్ఐ మల్లీశ్వరి, తిరుపతి రెడ్డి, కృష్ణయ్య, అమర్‌సింగ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పేద కుటుంబాలకు సాయం

ఘట్‌కేసర్: చౌదరిగూడలో ఇటీవల మరణించిన వారి కుటుంబాలకు మల్లారెడ్డి ట్రస్ట్ అండగా నిలిచింది. గ్రామానికి చెందిన దోటి నరసమ్మ, వెంకటాద్రి టౌన్‌షిప్‌నకు చెందిన అప్పారావు కుటుంబీకులను మంత్రి మల్లారెడ్డి ఆదేశానుసారం ఎంపీటీసీ రామారావుముదిరాజ్, ఉప సర్పంచ్ మహేందర్‌గౌడ్, బీఆర్ఎస్ స్థానిక శాఖ అధ్యక్షుడు లింగం యాదవ్ బాధితుల ఇంటికెళ్లి సోమవారం పరామర్శించారు. అనంతరం ఒక్కో కుటుంబానికి రూ.5 వేల చొప్పున రూ.10 వేలను అందజేశారు. మాజీ సర్పంచ్ రాములుగౌడ్, జగన్‌మోహన్‌రెడ్డి, మల్లారెడ్డి ట్రస్ట్ సభ్యుడు వేణుగోవింద్ పాల్గొన్నారు.

విశ్వకర్మల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం మొండిచేయి

- 'విశ్వకర్మ కౌశల్ సమ్మాన్'ను సద్వినియోగం చేసుకోవాలి
- జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారి



మాట్లాడుతున్న తల్లోజు ఆచారి

మల్లాపూర్: విశ్వకర్మ కౌశల్ సమ్మాన్ యోజన పథకాన్ని విశ్వకర్మలు ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తల్లోజు ఆచారి అన్నారు. సోమవారం మల్లాపూర్ వీఎస్ఆర్ గార్డెన్‌లో బీజేపీ తెలంగాణ– విశ్వకర్మ సెల్, పీఎం విశ్వకర్మ కౌశల్ సమ్మాన్ సభను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. దేశంలో కులవృత్తులను ప్రోత్సహించేందుకు ప్రధాన మంత్రి అనేక సంక్షేమ పథకాలను చేపడుతున్నారన్నారు. విశ్వకర్మ కౌశల్ సమ్మాన్ యోజన పథకాన్ని విశ్వకర్మలు ఎలా ఉపయోగించుకోవాలో వివరించారు. రాష్ట్రంలో 30 లక్షల మంది నిరుద్యోగులను కేసీఆర్ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. విశ్వకర్మల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం మొండిచేయి చూపిందన్నారు. ఇప్పటి వరకు విశ్వకర్మలకు ఎటువంటి లోన్ ఇవ్వలేదన్నారు. కర్ర, యంత్రాలపై అధిక పన్నులు వసూలు చేస్తూ వారిని వృత్తికి దూరం చేస్తున్న కేసీఆర్, కేటీఆర్‌కు త్వరలోనే ఘోరీ కడతామన్నారు. విశ్వకర్మ శక్తిని చాటాల్సిన అవసరం ఎంతైనా ఉందని పిలుపునిచ్చారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో పేదల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టారని, తెలంగాణ తప్ప అన్ని రాష్ట్రాల్లో కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు బాగుందన్నారు. ఆయుష్మాన్ భారత్ పథకంలో దరఖాస్తు చేసుకుంటే ఉచితంగా రూ.5 లక్షల వరకు వైద్య సేవలు పొందవచ్చన్నారు. అనంతరం బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ మాట్లాడుతూ.. దేశంలో కులవృత్తులను ప్రోత్సహించేందుకు ప్రధాన మంత్రి అనేక సంక్షేమ పథకాలను చేపడుతున్నారన్నారు. రాష్ట్ర విశ్వకర్మ సెల్ కన్వీనర్ పుసాల బ్రహ్మచారి, కో కన్వీనర్ పడకంటి బ్రహ్మచారి గోవర్ధన్‌చారి, దరువు అంజన్న, సోమన్న, శ్రీనివాసాచారి, వీరబ్రహ్మం, రాంప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కే ప్రజాదరణ



మచ్చబొల్లారంలో యాత్రలో నందికంటి శ్రీధర్

అల్వాల్: రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఆదరిస్తారని పార్టీ జిల్లా అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ అన్నారు. సోమవారం మచ్చబొల్లారం డివిజన్‌లో హాథ్ సే హాథ్ జోడో యాత్ర జరిగింది. ఆయన మాట్లాడుతూ కర్నాటక ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పక్షాన నిలిచారన్నారు. ఇక్కడ కూడా ప్రజావ్యతిరేక ప్రభుత్వానికి చరమగీతం పాడే సమయం ఆసన్నమైందని అన్నారు. కార్యక్రమంలో జోలి రమేష్, యాదగిరి, పవన్ తదితరులు పాల్గొన్నారు.

ఐసీఎస్ఈలో సమారిటన్ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థిని అభినందిస్తున్న రామిరెడ్డి

అల్వాల్: ఐసీఎస్ఈ పదవ తరగతి పరీక్షల్లో నేరేడ్‌మెట్‌లోని సమారిటన్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. పాఠశాల డైరెక్టర్ రామిరెడ్డి మాట్లాడుతూ వంద శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని, విద్యార్థిని వేదలింగా 95 శాతం మార్కులతో మొదటి స్థానంలో నిలిచారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

కార్యదర్శిపై చర్యలు తీసుకోండి

ఘట్‌కేసర్: గ్రామసభ, విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని కొర్రెముల్‌కు చెందిన పలువురు కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. సమయానికి గ్రామ సభలు నిర్వహించడం లేదని, తూతూమంత్రంగా సభ పెట్టి కొందరి సంతకాలు తీసుకుంటున్నారని, నిత్యం కార్యాలయానికి రావడంలేదని, సమస్యల పరిష్కారం కోసం ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయడం లేదని ఆరోపించారు. గ్రామంలో పారిశుద్ధ్యం, హరితహారంపై పట్టింపు లేదని, ప్రజల సమస్యలను పరిష్కరించడంలో విఫలమయ్యారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

వైకుంఠధామాలను అభివృద్ధి చేస్తాం

ఉప్పల్: చిలుకానగర్ డివిజన్‌లోని అన్ని శ్మశానవాటికలను వైకుంఠధామాలుగా మారుస్తామని చిలుకానగర్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ అన్నారు. క్రిస్టియన్ మైనార్టీ కమిటీ సభ్యుల వినతి మేరకు సోమవారం క్రిస్టియన్ శ్మశానవాటికలో 18 విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యుత్ స్తంభాలతో పాటు వాటికి సోడియం వైపర్ లైట్స్ ఏర్పాటు చేయించనున్నట్లు తెలిపారు. అన్ని శ్మశానవాటికల్లో ఆధునిక వసతులు కల్పించి వైకుంఠధామాలుగా మారుస్తామన్నారు. కార్యక్రమంలో బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, జేమ్స్, రాజు, పంతులమ్మ, పీటర్‌పాల్, నాగయ్య, బొల్లం లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



చిలుకానగర్ శ్మశానవాటికలో పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్

రేపు నిర్వహించే పాలీసెట్ పరీక్షకు సర్వం సిద్ధం

రామంతాపూర్: పదో తరగతి తర్వాత స్వల్ప వ్యవధిలో ఉద్యోగం, ఉపాధి పొందాలనుకునే వారికి అందుబాటులో ఉండేవి పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సులు, పాలీసెట్‌లో సాధించిన ర్యాంకు ఆధారంగా ప్రభుత్వ, ప్రభుత్వ ఎయిడెడ్ ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలలో మూడేళ్ల డిప్లొమా కోర్సులు ప్రవేశాల్లో ఇంజినీరింగ్ టెక్నికల్ కోర్సులతో పాటు అగ్రికల్చర్, హార్టికల్చర్, వెటర్నరీ ప్యాకేజింగ్ వంటి ప్రత్యేక డిప్లొమా కోర్సుల్లో కూడా చేరవచ్చు. రాష్ట్రంలో పాలిటెక్నిక్ కాలేజీల్లో ప్రవేశాల కోసం నిర్వహించే పాలీసెట్ పరీక్ష ఈ నెల 17న (బుధవారం)న నిర్వహిస్తున్నారు. రామంతాపూర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల కో ఆర్డినేషన్ సెంటర్ ఆధ్వర్యంలో రామంతాపూర్, హబ్సిగూడ పరిధిలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు, 3,015 విద్యార్థులు హాజరవుతున్నట్లు పరీక్షల కో ఆర్డినేటర్, ఉప కో ఆర్డినేటర్ ఎ.వినయ్ కుమార్, బీవీ రావు తెలిపారు. పరీక్ష కేంద్రాలు ఐఐసిటీ జహీర్ మెమోరియల్ స్కూల్, హబ్సిగూడ, స్ఫూర్తి డిగ్రీ కాలేజీ, మెగా మహిళా డిగ్రీ కాలేజ్ ప్రిన్స్‌టన్ పీజీ కాలేజ్, ప్రిన్స్టన్ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పరీక్ష నిర్వహిస్తారు.

నేడు బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం



మాట్లాడుతున్న దర్గా దయాకర్‌రెడ్డి, జక్కా వెంకట్‌రెడ్డి

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో బీఆర్ఎస్ అధిష్టానం పిలుపుమేరకు మంగళవారం ఫణి గార్డెన్‌లో నిర్వహించే ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని అధ్యక్షులు దర్గా దయాకర్‌రెడ్డి, మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. మేడిపల్లి ఎస్వీయం హోటల్‌లో ఆత్మీయ సన్నాహక సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరుతూ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్పొరేషన్ నుంచి ప్రతి కార్యకర్త హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు పాల్గొంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్, ప్రధాన కార్యదర్శి పాశం రాజు యాదవ్, బోయినపల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ శ్రీనివాస్‌గౌడ్, నాయకులు ఎడవల్లి రఘువర్ధన్‌రెడ్డి, జావేద్ ఖాన్, చింతల నర్సింహారెడ్డి, కాటపాక కుమార్, మల్లం వెంకటేష్, దేవిసింగ్ నాయక్, సునీల్, శ్రీనునాయక్ తదితరులు పాల్గొన్నారు.

బాక్సింగ్‌లో గోల్డ్ మెడల్

శామీర్‌పేట్: శామీర్‌పేటలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థిని బాక్సింగ్ ఛాంపియన్ షిప్‌లో గోల్డ్ మెడల్ సాధించింది. ఈ నెల 14న రాష్ట్ర బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ 52–54 కిలోల పోటీల్లో గురుకుల కళాశాలకు చెందిన వర్షిత ఉత్తమ ప్రతిభ కనబర్చి బంగారు పతకాన్ని సాధించడంతో జాతీయస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికైందని కళాశాల ప్రిన్సిపల్ ఇష్రాత్ తెలిపారు.